క్లుప్తంగా

గుమ్మడిని పరామర్శించిన అవినాష్



పెనమలూరు: వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్‌ను ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆదివారం ఆస్పత్రిలో పరామర్శించారు. యనమలకుదురుకు చెందిన గుమ్మడి విజయ్‌కుమార్‌కు శనివారం గుండె నొప్పి రావటంతో విజయవాడలో ఆస్పత్రిలో చేరారు. ఈ సమాచారం తెలుసుకున్న దేవినేని అవినాష్ వెంటనే ఆస్పత్రికి చేరుకొని గుమ్మడి విజయ్‌కుమార్‌ను పరామర్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా గుమ్మడి విజయ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

150 మందికి కంటి వైద్య పరీక్షలు



పెనమలూరు: యనమలకుదురులో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గుమ్మడి జైరాజ్ కళాపీఠం అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్ సహకారంతో గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధనేకుల మురళీమోహన్‌రావు ప్రారంభించారు. శంకర నేత్రాలయం వైద్యుల బృందం వైద్య శిబిరంలో పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మరీదు శ్రీనివాసరావు, గుమ్మడి అన్వేష్, యార్లగడ్డ వీరబాబు, గ్రామ పెద్దలు మాజీ సర్పంచి ధనేకుల వెంకటరత్నం, డాక్టర్ అయోధ్య సత్యనారాయణ, శివరామ్, సుకుమార్ పలువురు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో చికిత్స పొందుతున్న బాధితులకు సీఎంఆర్‌ఎఫ్‌ను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందజేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న 23 మందికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయగా వారికి రూ.33 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులను సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, పలువురు నేతలు, బాధితుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణ వేదిక నిర్మాణానికి వితరణ



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ వేదిక నిర్మాణానికి భక్తులు రూ.1,50,136 విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆలయ కమిటీకి భక్తులు కాసరనేని శేషువర్ధన్, విజయలక్ష్మి దంపతులు రూ.1,00,116, మర్లపాలెంకు చెందిన మేడసాని వెంకటరామకృష్ణారావు, భార్గవి దంపతులు రూ.50,020 నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ మాట్లాడుతూ.. భక్తులందరి సహకరంతో శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదిక నిర్మాణ పనులను వేగవంతంగా చేస్తున్నట్లు తెలిపారు. త్వరితగతిన నిర్మాణం పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కల్యాణ వేదిక నిర్మాణానికి స్వచ్ఛందంగా ముందుకువస్తున్న భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీకి చెందిన జాస్తి ఫణిశేఖర్, కాసన్నేని నాని, జాస్తి శ్రీనివాసరావు, పలువురు పాల్గొన్నారు.

12న ఉచిత వైద్య శిబిరం

గన్నవరం: స్థానిక బుద్ధవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా భవనంలో ఈ నెల 12న ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గన్నవరం శాఖ అధ్యక్షుడు ఆవుటపల్లి మోహన్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన అగర్వాల్ కంటి ఆస్పత్రి నేత్ర వైద్యసేవలు, డాక్టర్ మణిపాల్ ఆస్పత్రి వైద్యులచే గుండె, ఊపిరితిత్తులు, క్యాన్సర్, బీపీ, షుగర్, ఏకో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాన్ని రిటైర్డ్ ఉద్యోగులు, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర సమాచారం కోసం 99122 28338 సెల్ ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ప్రయాణం.. ప్రాణసంకటం



చినవోగిరాల వద్ద పుల్లేరు కాలువ వంతెనపై శిథిలావస్థకు చేరిన రెయిలింగ్



ఎగినపాడు వద్ద రైవస్ కాలువపై వంతెన వద్ద కోతకు గురైన దృశ్యం



ఎగినపాడు నుంచి నాగన్న గూడెం మధ్యలో పంటకాలువపై కల్వర్టు దుస్థితి

- శిథిలమైన వంతెనలు..
- కల్వర్టులదీ అదేపరిస్థితి
- భయపడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

ఉయ్యూరు రూరల్: రహదారుల కింద కాలువలపై అక్కడక్కడ నిర్మించిన కల్వర్టులు శిథిలావస్థకు చేరడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. ఆదమరిచి అటుగా పయనిస్తే అంతే సంగతులు అనేలా కల్వర్టులు దర్శనమిస్తున్నాయి.

విషయం ఇదీ..

రహదారుల నిర్మాణ సమయంలో వాటి కింద చిన్న చిన్న కల్వర్టులు, వంతెనలు నిర్మించారు. అవి నేడు శిథిలావస్థకు చేరాయి. వాటిపై ఆ శాఖ అధికార యంత్రాంగం పర్యవేక్షణ లోపించడంతో శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి.

ఎక్కడెక్కడ అంటే..

ఉయ్యూరు మండలంలో ప్రధానంగా పుల్లేరు కాలువపై ఏర్పాటు చేసిన వంతెన ప్రమాదకరంగా మారడంతో పాటు ఉయ్యూరు నుంచి ఎగినపాడు వెళ్లేందుకు రైవస్ కాలువపై ఏర్పాటు చేసిన వంతెన



నాగన్నగూడెం, అంబేడ్కర్ నగర్ మధ్య కల్వర్టు



కాటూరు- బోల్లపాడు మధ్య ప్రమాదకరంగా కల్వర్టు

ఇరువైపులా కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు నాగన్న గూడెం నుంచి కాటూరు అంబేడ్కర్‌నగర్‌కు వెళ్లే రహదారిలో పంట కాలువపై నిర్మించిన కల్వర్టుకు ఇరువైపులా రెయిలింగ్ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. కాటూరు నుంచి బోల్లపాడు వెళ్లే రహదారి కింద ఉన్న కాలువ, ముదునూరు నుంచి జబర్లపూడి మీదుగా పమిడిముక్కల మండలం, మద్రివాడ వెళ్లే మురుగు కాలువపై నిర్మించిన వంతెనలు సైతం కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలో పలు ప్రాంతాలకు సాగునీరు, మురుగునీరు తరలించేందుకు ఏర్పాటు చేసిన కాలువలపై నిర్మించిన కల్వర్టులను అభివృద్ధి పరచాలని వాహనదారులు కోరుతున్నారు.

అంచనాలు సిద్ధం చేస్తున్నాం

పుల్లేరు కాలువపై వంతెన రెయిలింగ్ మరమ్మతులకు అంచనాలు తయారు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తాం. అలాగే మండలంలో శిథిలమైన ఇతర కల్వర్టులు, వంతెనల అభివృద్ధికి గతంలోనే అంచాలు పంపించారు. ఉన్నతాధికరుల నిధుల కేటాయింపు, ఆదేశాల మేరకు త్వరిత గతిన అభివృద్ధి చేస్తాం.

–ఎస్.మల్లికార్జున, ఏఈ, ఆర్ అండ్‌బీ

ఉత్సాహంగా.. ఉల్లాసంగా.. బాలోత్సవం



సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థినులు



కోలాట నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో తృతీయ పిల్లల పండుగను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం మండలాల్లోని పాఠశాలలకు చెందిన 1,200 మంది విద్యార్థులు అకడమిక్, సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్ని సత్తాచాటారు. సాంస్కృతిక నృత్యాలు, ఏకపాత్రాభినయాలు, మట్టిబొమ్మల తయారీ, కోలాట ప్రదర్శన, పాటల పోటీలతో విద్యార్థులు అలరించారు. తొలుత ఈ పోటీలను మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు గన్నె వెంకట్రావు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించి అభినందించారు. సాయంత్రం వరకు జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. గొల్లనపల్లి హెచ్‌ఎం కేఏస్.జగదీశ్వర రావు సంధానకర్తగా వ్యవహరించగా జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, కమిటీ ప్రధాన కార్యదర్శి కర్రా వరప్రసాద్, పుణ్యా చారిటీస్ కార్యదర్శి జేవీబీ. కుమార్, కమిటీ సభ్యులు మరీదు వరప్రసాద్, దాసరి నవభారతి తదితరులు పాల్గొన్నారు.

కామన్ స్థలాన్ని కాపాడాలని ఆందోళన



ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న సర్పంచి సీతయ్య, గ్రామస్తులు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని తొమ్మిది గ్రామాల్లో కామన్ స్థలాలను కబ్జాలకు గురికాకుండా సంరక్షిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు. ఆదివారం అంబాపురం గ్రామంలోని కామన్ స్థలాన్ని కాపాడాలని, వాటర్‌ట్యాంక్ నిర్మించాలని గ్రామస్తులు ప్లకార్డులు పట్టుకొని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ మండలంలోని తొమ్మిది గ్రామాలు విజయవాడ నగరానికి ఆనుకొని ఉండటం వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకొంటున్నారన్నారు. స్థలాల రేట్లు పెరగడంతో కామన్ స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని, వాటిని సంరక్షిస్తానని అన్నారు. గ్రామాల్లోని కామన్ స్థలాల వివరాలను అందజేయాలని తహసీల్దార్‌ను ఆయన ఆదేశించారు. అంబాపురంలోని కామన్ స్థలం ప్రభుత్వానిదా, ఎఫ్‌సీఐ వెంచర్ వేసినవారిదో అధికారులు నిర్ధారించాలన్నారు. ఈ స్థలం విషయాన్ని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడానని, పోలీసు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కబ్జా అయితే స్థలాన్ని కాపాడతానని, అవసరమైతే అసెంబ్లీలో చర్చిస్తానన్నారు. ప్రజల కోరిన మేరకు వాటర్ ట్యాంక్ నిర్మిస్తానని హామీ యిచ్చారు. ప్రజలు ఆందోళన చేయాల్సిన అవసరం లేదని, సమస్యను తన దృష్టికి తీసుకొస్తే చాలన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఈ స్థలం విషయంలో కొంత జాప్యం జరిగిందన్నారు. గండికోట సీతయ్య ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో గ్రామస్తులు పాల్గొన్నారు. అధికారులు తహసీల్దార్ బి.సుగుణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మురళీకృష్ణప్రసాద్, కార్యదర్శి డి.శ్రీనివాసరావు ఎమ్మెల్యేతో పాటు వచ్చారు.

గోకులం షెడ్లు ప్రారంభం

పాతపాడు(విజయవాడరూరల్): ఉపాధి నిధులతో పాతపాడు గ్రామంలో నిర్మించిన మూడు గోకులం షెడ్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఆదివారం రాత్రి ప్రారంభించారు. పాతపాడు గ్రామ శివారు అప్పారావుపేట గ్రామంలో అమ్మన సత్యవతి, మంగళాపురం గ్రామంలో కారంకి ఆదినారాయణ, పాతపాడు గ్రామంలో బెల్లంకొండ సురేష్ గోకులాలను నిర్మించారు. ఒక్కో యూనిట్‌కు రెండు లక్షల 30 వేల రూపాయలను మంజూరు చేయగా, దానిలో 90 శాతం సబ్సిడీ ఉంది. ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచి దేవగిరి సుజాత, అధికారులు తహసీల్దారు బి.సుగుణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మురళీకృష్ణప్రసాద్, ఏఈ శివరామకృష్ణ, ఉపాధి పథకం ఈసీ, కె.శ్రీనివాసరావు, పంచాయతి కార్యదర్శి పి.కోటిలింగమ్మ, టీడీపీ పార్టీ నాయకులు గుజ్జర్లపూడి బాబురావు, గొడ్డళ్ళ చినరామారావు, కొండేటి వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

అయ్యంకి వెంకట రమణయ్యకు నివాళి



అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 46వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కె.రమాదేవి పద్మశ్రీ అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమాదేవి మాట్లాడుతూ.. అయ్యంకి వెంకట రమణయ్య తన 19వ ఏట బిపిన్ చంద్రపాల్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రజా సేవ వైపు అడుగులు వేశారన్నారు. దేశమంతా గ్రంథాలయాలను స్థాపించిన వ్యక్తిగా, గ్రంథాలయ పితామహునిగా పేరు పొందారని చెప్పారు. రామ్మోహన్ గ్రంథాలయం స్థాపనలో అయ్యంకి కృషి ఎనలేనిదన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు తెలుగులో కూరగాయలు, పండ్లు పేర్లను తప్పులు లేకుండా రాసే పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: ఉంగుటూరు సెక్షన్‌లోని నందమూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మానికొండ ఫీడర్ లైనుల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జి.బి. శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఈ- పంట జాబితా ప్రదర్శన

గన్నవరం: ప్రస్తుత రబీ సాగుకు సంబంధించి రైతుల ఈ క్రాప్ నమోదు ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ముసాయిదా జాబితాను ఈ నెల 10 నుంచి రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి వై.రజని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10, 11 తేదీల్లో గ్రామసభలను నిర్వహించి జాబితా వివరాలను చదువుతారన్నారు. ముసాయిదా జాబితాలను అయా గ్రామాల రైతులు పరిశీలించి అభ్యంతరాలు తెలియజేయాలని సూచించారు. అభ్యంతరాల పరిశీలన తర్వాత మార్పులు, చేర్పులు చేసి ఈ నెల 22న తుదిజాబితాను ప్రకటిస్తామన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ఆదివారం గన్నవరంలో జరిగిన బాలోత్సవంలోవివిధ విభాగాల్లో ప్రతిభ చాటి 8 అవార్డులు సాధించారు. వారిని నిర్వాహకులు, ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు. పోటీలు జరిగిన ప్రతి వేదికపై సత్తా చాటుతూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విజయవాడకల్చరల్: విప్రవ్యాపార సాధికారిక సంస్థ, ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంగీత కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బిగ్ బిజినెస్ వ్యాపార ప్రమోషన్ కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. నాట్యాచారిణి యల్లాజోస్యుల అనూరాధ బృందం కూచిపూడి సంప్రదాయంలో ప్రదర్శించింది. అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు కీర్తనలకు నృత్యాలను అభినయించారు.

చలివేంద్రం ప్రారంభం



కంకిపాడు: వేసవిలో తాగునీటిని ప్రజలకు అందుబాటులో ఉంచాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. ఈడుపుగల్లులోని మస్జీద్ ఏ అలీ కమిటీ అధ్యక్షుడు షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో మస్జీద్ ఏ అలీ ప్రాంగణం వద్ద ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో పందిపాటి సుధాకర్, ముస్లిం పెద్దలు షేక్ గూడుసాహెబ్, షేక్ సిద్దయ్య, షేక్ సుభాన్‌వలి, షేక్ సలీమ్, ఎండీ రఫూఫ్, షేక్ రఫీ, షేక్ మీరావలి, షేక్ అక్బర్ బాషా, షేక్ ఫరీద్‌బాబా పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): భర్త వేధింపులపై ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాయకాపురం, వాంబేకాలనీకి చెందిన అపర్ణాదేవికి వన్‌టౌన్‌కు చెందిన గాజులశెట్టి సాయికృష్ణతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి బాబు. నెల రోజుల క్రితం అపర్ణాదేవి పుట్టింటికి వచ్చింది. ఈ నెల 8న భర్త, అత్త, వారి బంధువు తన్నీరు శ్రీనివాస్ ఆమె పుట్టింటికి వచ్చి ఫిర్యాదిని, ఆమె తల్లిని కొట్టగా కేసు నమోదు చేశామన్నారు.

దాత సహకారంతో సిమెంట్ రోడ్ల నిర్మాణం



శ్మశానవాటికలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు (ఇన్‌సెట్) గుర్రం అంజయ్య

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం, అల్లాపురం గ్రామాల ఉమ్మడి హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి దాత గుర్రం అంజయ్య (నాని) ముందుకువచ్చారు. ఆయన పెదనాన్న గుర్రం సుబ్బయ్య, శేషారత్నం దంపతులు, భార్య రజనీ జ్ఞాపకార్థం సుమారు రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. శ్మశానవాటిక అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఆదివారం నుంచి ప్రధాన రహదారి, రెండు అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుర్రం నాని మాట్లాడుతూ.. ఉమ్మడి గ్రామాల హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించాలని గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తనను కోరినట్లు తెలిపారు. వీరి విజ్ఞప్తిపై వెంటనే స్పందించి శ్మశానవాటికలో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఇటువంటి అభివృద్ధి కార్యక్రమం ద్వారా జన్మభూమి రుణం తీర్చుకునే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే అల్లాపురం గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణంతో పాటు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇరు గ్రామాల ప్రజల అవసరాలకు అనుగుణంగా తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు. అడిగిన వెంటనే స్పందించి శ్మశానవాటిక అభివృద్ధికి తోడ్పాటునందించిన గుర్రం నానికి కమిటీ సభ్యులు నరసయ్య, గొంది పూర్ణచంద్రరావు తదితరులు అభినందనలు తెలియజేశారు. దాతల సహకారంతో శ్మశానవాటికను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



నున్న గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

నున్న(విజయవాడరూరల్): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను నైతిక బాధ్యతగా తీసుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీక్రైమ్ కౌన్సిల్ చైర్మన్ కేజే రాజు అన్నారు. ఆదివారం నున్న గ్రామం సీయోనుపేట, పరిసర ప్రాంతాల్లో చైల్డ్‌విజన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీయోనుపేట, చెరువు పరిసరాలను ట్రస్ట్ విద్యార్థులు శుభ్రం చేశారు. చెత్తా, చెదారం చెరువులో డంప్ చేయకుండా అక్కడ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేజే రాజు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రీన్ గ్రాస్ సొసైటీ ఏపీ సర్కిల్ ప్రెసిడెంట్ వరప్రసాద్, చైల్డ్ విజన్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ పి.ప్రసాద్, సభ్యులు వై.సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేసిన ద్విచక్రవాహనం

ఉయ్యూరు: ద్విచక్రవాహనం దగ్ధమైన ఘటన ఉయ్యూరులో కలకలం రేపింది. సేకరించిన వివరాల ప్రకారం.. ఉయ్యూరు పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న చిమటా శోభనాద్రి యాక్సెస్ ద్విచక్రవాహనాన్ని ఇంటి బయట రోడ్డు పక్కన నిలిపి ఉంచాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పంటించారు. స్థానికుల అరుపులు, కేకలతో బయటకు వచ్చిన శోభనాద్రి తన ద్విచక్ర వాహనం కాలిపోతుండటాన్ని గుర్తించాడు. మంటలు అదుపుచేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. సమీపంలో ఉన్న వీరంకి శివ శంకర్‌కు చెందిన ద్విచక్రవాహనం కూడా పాక్షికంగా దెబ్బతింది. స్థానికులు మంటలను అదుపుచేయటంతో ప్రమాదం తప్పింది. శోభనాద్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విశ్వనాథ్ తెలిపారు.

అత్యాధునిక సౌకర్యాలతో వైద్య సేవలు



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న వంగవీటి రాధాకృష్ణ, వైద్య బృందం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మహానాడు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సేఫ్ విజన్ మల్టీస్పెషాలిటీ కంటి ఆస్పత్రిని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ప్రతినిధులు డాక్టర్ బత్తిన ప్రవీణ, చలపాటి జయంత్, స్వర్ణ మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో అన్ని వర్గాల వారికి అత్యాధునిక సౌకర్యాలతో అధునాతన పరికరాలతో వైద్య సేవలను అందుబాటులోని తీసుకువచ్చామన్నారు. కేటరాక్ట్, లాసిక్, రెటీనా, పీఆర్‌కే, ట్రాన్స్‌ప్రాక్, గ్లుకోమా, కార్నియా, ఆకులోప్లాస్టీ, పీడియాట్రిక్ ఐ కేర్, రిఫ్రాక్టివ్ ఎర్రర్స్, ఫార్మసీ, ఐసీఎల్, డైవస్, ఆప్టికల్స్, కాంటాక్ట్ లెన్స్, లాబొరేటరీ సౌకర్యలు ఉన్నాయని చెప్పారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి, నగరంలోని వైద్యులు, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ శతాబ్ది ఉత్సవాలు



నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరులోని సీతారామ చంద్రమూర్తి స్వామి దేవస్థానం శతాబ్ది ఉత్సవాలు ఆదివారం వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతారామచంద్రమూర్తి ఆలయం నిర్మించి వందేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా వ్యవస్థాపకుడు ముసునూరి వెంకయ్య కుటుంబ సభ్యులు ఆలయ పుర్నిర్మాణం చేపట్టారు. ఆలయ గోపుర నూతన కలశం, నూతన ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ముసునూరి శ్రీనివాసరావు, పద్మజ దంపతుల చేతుల మీదగా వేద పండితులు శ్రీరామ పట్టాభిషేకాయుత మహాకుంభాభిషేకం కన్నుల పండువగా జరిగింది. ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్నారు. సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నసంతర్పణ నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెదిన భక్తులు, గ్రామ ప్రముఖులు, ముసునూరి కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: తాడిగడప జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు అవ్వటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు ఇందిరానగర్‌కు చెందిన సయ్యద్ ఫాతిమా తన స్కూటీపై వెళుతుండగా తాడిగడప జంక్షన్ వద్ద బైక్‌పై వచ్చిన వ్యక్తి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఫాతిమాకు గాయాలు అవ్వటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు, రేపు గ్రామ సభలు



వై.రజని

గన్నవరం రూరల్: రబీ పంటల సాగుకు సంబంధించి రైతుల ముసాయిదా జాబితా సోమవారం నుంచి రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శిస్తామని మండల వ్యవసాయాధికారి వై.రజని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమ, మంగళవారాల్లో గ్రామ సభలు నిర్వహించి పంట నమోదు వివరాలు తెలియజేస్తామన్నారు. ఆయా గ్రామాల్లోని రైతులు వివరాలు తెలుసుకుని అభ్యంతరాలు తెలియజేయాలన్నారు. అభ్యంతరాలు ఉంటే మార్పులు చేసి తుది జాబితా ఈ నెల 22న ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.